
సాక్షి
అనంతపురం
బుధవారం । 25 । జనవరి । 2023



చీనీ టన్ను రూ.28 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.28 వేలు పలికాయి.



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.20, కనిష్టం రూ.5, సరాసరి రూ.10 పలికింది.

గరిష్టం/కనిష్టం
32.1°/16.7°

జిల్లా అంతటా మంగళవారం చలి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగానూ, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి.

న్యూస్‌రీల్

పీఏబీఆర్‌లోకి 8 లక్షల చేప పిల్లలు



చేప పిల్లలను వదులుతున్న దృశ్యం

కూడేరు: మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నదే 'ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన' లక్ష్యమని మత్స్య శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ శాంతి తెలిపారు. మంగళవారం పీఏబీఆర్‌లోకి 8లక్షల చేప పిల్లలను వదిలే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, కొర్రకోడు సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ 40 శాతం ప్రభుత్వ సబ్సిడీ, 60 శాతం పీఏబీఆర్ మత్స్య సహకార సంఘం వాటాతో మేలు జాతి కట్ల, రోహు, మృగాల రకానికి చెందిన 10 లక్షల చేప పిల్లలను కొనుగోలు చేశామన్నారు. అందులో తొలి విడతగా 8 లక్షలు వదులుతున్నామన్నారు. తర్వాత మరో రెండు లక్షల పిల్లలను వదులుతామని చెప్పారు. కార్యక్రమంలో మండల అగ్రి అడ్వైజరీ కమిటీ చైర్‌పర్సన్ నిర్మలమ్మ, సింగిల్‌విండో డైరెక్టర్ గంగాధర్, కరుట్లపల్లి సర్పంచ్ ఓబుళమ్మ, వైఎస్సార్‌సీపీ నేత దేవేంద్ర, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు ఓబులేసు పాల్గొన్నారు.

రేపు ఏఆర్‌టీ కేంద్రానికి సెలవు

అనంతపురం సప్తగిరి సర్కిల్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అనంతపురం సర్వజనాస్పత్రిలోని ఏఆర్‌టీ కేంద్రానికి సెలవు ప్రకటించినట్లు వైద్యాధికారి సత్యనారాయణ వెల్లడించారు. ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఏఆర్‌టీ మందులు వాడే వారు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

సైబర్ నేరం కేసులో ఇద్దరి అరెస్ట్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగర్‌లోని ఓ బార్ యజమాని బ్యాంకు ఖాతా నుంచి కోటి రూపాయలు హ్యాక్ చేసిన సైబర్ నేరం కేసులో ఇద్దరు నిందితులను వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు ఢిల్లీకి చెందిన రాజూ చౌహాన్, హుమ్యాన్స్‌ను మంగళవారం రాత్రి మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా.. ఫిబ్రవరి ఆరో తేదీ వరకు రిమాండ్ విధించారు. ఇంకా ఈ కేసులో కీలక సూత్రధారిని అరెస్ట్ చేయాల్సి ఉందని సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపారు.

ఎస్కేయూకు అదనపు గ్రాంట్ మంజూరు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి రూ.42.85 కోట్ల అదనపు బ్లాక్ గ్రాంట్ మంజూరైంది. ఈ మేరకు ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రెటరీ జె.శ్యామలారావు జీఓ 14ను మంగళవారం జారీ చేశారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొత్తం రూ.65.87 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించింది. ఉద్యోగులకు జీతాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వడానికి మరో రూ.42.85 కోట్లు అవసరం అని ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మార్చి నెల వరకు జీతాలు వర్తించేలా అదనపు గ్రాంట్ మంజూరైంది. ఈ నేపథ్యంలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి రూ.108.72 కోట్ల బ్లాక్‌గ్రాంట్ దక్కింది.

బిడ్డకు పోషణ.. తల్లికి రక్షణ



- ఉమ్మడి జిల్లాలో 1.41 లక్షల మంది చిన్నారులకు లబ్ధి
- పోషకాహారం సరఫరాపై ప్రతినిత్యం పర్యవేక్షణ
- సంపూర్ణ పోషణ కింద లబ్ధి పొందుతున్న గర్భిణులు 30 వేల మందిపైనే
- కోవిడ్‌తో తల్లిదండ్రులను కోల్పోయిన 61 మంది చిన్నారులకు రూ.10 లక్షల చొప్పున సాయం
- మూడున్నరేళ్లలో మాతా శిశు రక్షణకు భేషైన చర్యలు

అనంతపురం జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు	10
బాలామృతం తీసుకుంటున్న చిన్నారులు	81,322
సంపూర్ణ పోషణ లబ్ధి పొందుతున్న చిన్నారులు	41,238
సంపూర్ణ పోషణ లబ్ధి పొందుతున్న గర్భిణులు	17,594
సంపూర్ణ పోషణ లబ్ధి పొందుతున్న బాలింతలు	16,681
శ్రీసత్యసాయి జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు	7
బాలామృతం తీసుకుంటున్న చిన్నారులు	60,285
సంపూర్ణ పోషణ లబ్ధి పొందుతున్న చిన్నారులు	39,511
సంపూర్ణ పోషణ లబ్ధి పొందుతున్న గర్భిణులు	12,730
సంపూర్ణ పోషణ లబ్ధి పొందుతున్న బాలింతలు	12,861

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో మూడేళ్లలోపు చిన్నారులకు ఇచ్చే బాలామృతం పుష్కలంగా అందుతోంది. 2019కు ముందు పరిస్థితి వేరు. ఇప్పటి పరిస్థితులు వేరు. అప్పట్లో అరకొరగా అందించడంతో పౌష్టికాహార లోపంతో బాధపడే చిన్నారుల సంఖ్య ఎక్కువగా ఉండేది. ప్రస్తుతం తగినంత పౌష్టికాహారం అందిస్తుండటంతో ఆ సమస్య గణనీయంగా తగ్గింది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో 1.40 లక్షల మంది చిన్నారులకు బాలామృతం క్రమం తప్పకుండా అందుతోంది. అత్యధిక పోషక విలువలున్న ఈ బాలామృతం సరఫరా పర్యవేక్షణ అత్యంత పకడ్బందీగా చేస్తున్నారు.

బాలింతలు గర్భిణులకు సంపూర్ణ పోషణ

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో కనీవినీ ఎరుగని రీతిలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారు. రాగిపిండి, బెల్లం, వేరుశనగ చిక్కీ, ఎండు ఖర్జూరం, జొన్న పిండి, అటుకులతో కూడిన ఆహారం ఇస్తున్నారు. అనంతపురం జిల్లాలో 17,594 మంది గర్భిణులు, 11681 మంది బాలింతలు లబ్ధి పొందుతున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 12,730 మంది గర్భిణులు, 12,861 మంది బాలింతలకు సంపూర్ణ పోషణ అందుతోంది.

కోవిడ్‌తో నిరాశ్రయులైన చిన్నారులకు అండగా..

కోవిడ్ బారినపడి తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులను రాష్ట్ర ప్రభుత్వం అక్కున చేర్చుకుంది. అనంతపురం జిల్లాలో 40 మంది చిన్నారులకు, శ్రీసత్యసాయి జిల్లాలో 21 మంది చిన్నారులను గుర్తించి రూ.10 లక్షల చొప్పున బ్యాంకులో డిపాజిట్ చేశారు. అంతేగాకుండా కోవిడ్‌తో తల్లి లేదా తండ్రిని కోల్పోయిన చిన్నారుల్లో అనంతపురం జిల్లాలో 671 మందిని గుర్తించి నెలకు రూ.500 చొప్పున ఐసీపీఎస్ ద్వారా పెన్షన్ ఇస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 387 మంది చిన్నారులకు ఈ పథకం ద్వారా లబ్ధి జరుగుతోంది.

తల్లీబిడ్డల క్షేమమే లక్ష్యం



ఏ ప్రభుత్వమూ చేపట్టని విధంగా జగనన్న ప్రభుత్వం చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషణ అందిస్తోంది. అప్పట్లో ఈ పనిని ప్రభుత్వాలు బరువుగా భావించేవి. కానీ మా ప్రభుత్వం బాధ్యతగా భావించి చేస్తోంది. మూడున్నరేళ్ల కాలంలో మాతా శిశు రక్షణకు తీసుకున్న చర్యలు సత్ఫలితాలిచ్చాయి.
–ఉషశ్రీచరణ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి

27 నుంచి 'అనంత బాలోత్సవ్'



ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న బాలోత్సవ్ నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: బాలల పండుగ 'అనంత బాలోత్సవ్' ఈ నెల 27న ప్రారంభమవుతుంది. మూడు రోజులపాటు సాగే బాలోత్సవ్‌కు సంబంధించిన బ్రోచర్లు, ఫ్లెక్సీని మంగళవారం క్రీసెంట్ పాఠశాలలో ఆవిష్కరించారు. బాలోత్సవ్ కమిటీ గౌరవాధ్యక్షురాలు షమీమ్ షఫీవుల్లా మాట్లాడుతూ చిన్నారుల్లో దాగి ఉన్న సృజనను వెలికితీసేందుకు బాలోత్సవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సావిత్రి, శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒత్తిడిని జయించేదిశగా విద్యార్థులు ఆటపాటలు, క్విజ్, సైన్సు ఎగ్జిబిషన్ వంటి వాటిల్లో ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో సభ్యులు పద్మజ, డాక్టర్ ప్రసూన, రామాంజనమ్మ, లక్ష్మి, హసీనా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నీతి అయోగ్ సభ్యుల పర్యటన

గార్లదిన్నె: నీతి అయోగ్ సభ్యులు బుధవారం మండలంలో పర్యటించనున్నారు. వీరు గార్లదిన్నె పీహెచ్‌సీ, కొప్పలకొండ, కనంపల్లి వెల్‌నెస్ సెంటర్లను పరిశీలించనున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ గౌతమి తెలిపారు. వెల్‌నెస్ సెంటర్ల ద్వారా గ్రామాల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీయనున్నారన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్, చిత్రంలో జేసీ కేతన్‌గార్గ్

- పారదర్శకంగా ప్రభుత్వ సేవలు
- అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారుల ఎంపిక
- మంత్రి ఉషశ్రీచరణ్

అనంతపురం సెంట్రల్: ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ తెలిపారు. ఏ పథకానికైనా కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నట్లు వెల్లడించారు. మంగళవారం నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో రవాణా శాఖ ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రత వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించి.. ప్రమాదాల నివారణకు సహకరించాలని పిలుపునిచ్చారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన వారికి మంత్రి చేతుల మీదు ప్రశంసాపత్రాలు, హెల్మెట్లు అందజేశారు.

లోకేష్ యాత్రతో ఒరిగేదేమీ లేదు

టీడీపీ నేత లోకేష్ చేపట్టే పాదయాత్ర వల్ల రాష్ట్రానికి ఒరిగేదేమీ లేదని మంత్రి ఉషశ్రీచరణ్ ఎద్దేవా చేశారు. పాదయాత్రను అడ్డుకుంటున్నారని వస్తున్న ఆరోపణలపై విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి స్పందించారు. పాదయాత్రతో ప్రభుత్వానికి వచ్చే నష్టమేమీ లేదని, ఆ కార్యక్రమాన్ని అడ్డుకోవాల్సిన అవసరం తమకు లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీకి శ్రీరామరక్ష అని అన్నారు. సంక్షేమ ప్రదాత జగనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని అన్ని వర్గాల ప్రజలూ కోరుకుంటున్నారని చెప్పారు. అనంతరం రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీని మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఉపరవాణా కమిషనర్ శివరామప్రసాద్, ఆర్టీసీ రీజనల్ చైర్‌పర్సన్ మంజుల, నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత, అదనపు ఎస్పీ నాగేంద్రుడు, మున్సిపల్ ఆర్డీ పీవీవీఎస్ మూర్తి, ఆర్టీఓ సురేష్‌నాయుడు, ఎంవీఐలు రమణారెడ్డి, అతికనాజ్, సునీత తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ పర్యాటక దినోత్సవం

అనంతపురం కల్చరల్: జాతీయ పర్యాటక దినోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు జిల్లా పర్యాటక శాఖాధికారి నాగేశ్వరరెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటలకు అనంతపురం ఆర్ట్స్ కళాశాల నుంచి బుక్కరాయసముద్రం వరకు ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. ఎంపీ తలారి రంగయ్య ర్యాలీని ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం దేవరకొండ వద్ద ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొంటారన్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలను చాటే టూరిజం ర్యాలీలో అందరూ పాల్గొనాలని కోరారు. జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా వివిధ కళాశాలల్లో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు జేసీ కేతన్ గార్గ్, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందిస్తారన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

అనంతపురం అర్బన్: వస్తువుల సేకరణలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ జిల్లా అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో నాణ్యతా ప్రమాణాలపై బీఐఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) జాయింట్ డైరెక్టర్లు సుజాత, రమాకాంత్ సాగర్ అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎస్ఓ శోభారాణి, హౌసింగ్ పీడీ కేశవనాయుడు, తూనికలు కొలతల శాఖ అధికారి స్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాలకు కళ్లెం



సర్పంచ్ దంపతులను అభినందిస్తున్న ఎస్పీ

పెద్దవడుగూరు : నిఘా పర్యవేక్షణ ఉంటే నేరాలకు కళ్లెం వేయవచ్చని ఎస్పీ ఫక్కీరప్ప అన్నారు. ప్రతి గ్రామంలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ వరలక్ష్మి సహకారంతో పంచాయతీ కార్యదర్శులు మురళీకృష్ణారెడ్డి, ప్రభాకర్‌తో కలిసి పెద్దవడుగూరులో 13 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి జిల్లాలోనే ఆదర్శంగా నిలిచారు. వీరిని ఎస్పీ మంగళవారం అభినందించి, సన్మానించారు. పెద్దవడుగూరు తరహాలోనే మిగిలిన గ్రామాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాలను నియంత్రించడంతో పాటు నేరస్తులను త్వరగా పట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మీ సుంకన్న, ఎంపీపీ శ్రీదేవి నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

సుదర్శన్‌రెడ్డి త్యాగం మరువలేనిది.

పెద్దవడుగూరు పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఫక్కీరప్ప తనిఖీ చేశారు. రౌడీ షీటర్లు, ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహానికి ఎస్పీ పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి వీరజవాన్ కుమ్మెత సుదర్శన్‌రెడ్డి స్థూపం వద్దకు చేరుకుని, నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మేలుకొలుపు యువజన సంఘం నాయకులు, శ్రీసరస్వతి హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లోనే 'ఉగాది' సంబరాలు

- కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

అనంతపురం సిటీ: ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి వైఎస్సార్ జగనన్న కాలనీల్లోనే లబ్ధిదారులు సంబరాలు చేసుకునేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. అనంతపురం డివిజన్‌లో 9,199 ఇళ్లు ఉగాది నాటికి నిర్మించాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు.

'నాడు – నేడు' పనులపైనా సమీక్ష

నాడు–నేడు కింద చేపట్టిన పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆర్‌బీకేలు, సచివాలయాలు, ఇతర భవనాలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాల పైనా కలెక్టర్ సమీక్షించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ) యమ్మాని భాగ్యరాజ్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ శ్రీనివాసులు, గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జ్ పీడీ గుత్తా కేశవనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ హసన్‌బాషా, ఆర్డీఓ మధుసూదన్, నగర పాలక కమిషనర్ భాగ్యలక్ష్మి, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

న్యాయం గెలిచింది!

- వైఎస్సార్‌సీపీ నేత చెన్నారెడ్డి హత్య కేసులో సంచలన తీర్పు
- ఆరుగురు టీడీపీ నాయకులకు జీవిత ఖైదు
- తీర్పుపై హర్షం వ్యక్తం చేసిన బాధిత కుటుంబం





హత్యకు గురైన ఎర్రగుంట చెన్నారెడ్డి (ఫైల్), తల్లి భాగ్యమ్మకు స్వీటు తినిపిస్తున్న కుమార్తె

ధర్మవరం: స్వార్థ ప్రయోజనాలు, రాజకీయ ఎదుగుదల కోసం టీడీపీ నేతల రాక్షస క్రీడకు బలైన వైఎస్సార్‌సీపీ నేత ఎర్రగుంట చెన్నారెడ్డి హత్య కేసులో నిందితులపై అభియోగాలు రుజువయ్యాయి. టీడీపీ నేతలు కేవలం గ్రామంలో ఆధిపత్యం కోసం అమాయకుడైన వైఎస్సార్‌సీపీ నాయకుడు చెన్నారెడ్డిని అత్యంత దారుణంగా హత మార్చిన ఉదంతంలో ఆరుగురు టీడీపీ నాయకులకు జీవితఖైదు విధిస్తూ అనంతపురం జిల్లా జడ్జి శ్రీనివాస్ మంగళవారం సంచలన తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ హరినాథరెడ్డి వాదనలు వినిపించారు.

పాశవికంగా హతమార్చారు..

ధర్మవరం మండలం బడన్నపల్లిలో 2017 డిసెంబర్ 6న గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రగుంట చెన్నారెడ్డిని ప్రత్యర్థులైన టీడీపీ నాయకులు కపాడం గంగాధర్, కపాడం సూర్యనారాయణ, దాసరిపెద్దన్న, దాసరి శివయ్య, దాసరి గంగాప్రసాద్, కపాడం నాగరాజు అత్యంత కిరాతకంగా వేటకొడవళ్లతో నరికి చంపారు. గ్రామం నుంచి ఉదయం 9 గంటలకు టీవీఎస్ స్కూటర్‌లో యూరియా చల్లేందుకు వెళ్తున్న చెన్నారెడ్డిని తోట సమీపంలో అటకాయించి టీడీపీ నాయకులు విచక్షణా రహితంగా నరికి చంపారు. తోట సమీపంలోనే పని చేస్తున్న ఉన్న మృతుని భార్య భాగ్యమ్మ, అక్క శాంతమ్మ, రాఘవరెడ్డి జరుగుతున్న దారుణాన్ని చూసి కేకలు వేస్తూ చంపొద్దు అంటూ వేడుకున్నా కనికరించకుండా హత్య చేసి వెళ్లిపోయారు. అప్పట్లో మృతుని భార్య భాగ్యమ్మ ఫిర్యాదుతో ధర్మవరం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సీఆర్ నంబర్ 118/2017తో ఎఫ్ఐఆర్ నమోదు చేసి నిందితులపై 302 రెడ్‌విత్ 34 ఐపీసీ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదుచేశారు. అప్పటి సీఐ శివరాముడు చార్జిషీట్ దాఖలు చేశారు.

బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పిన జగన్

టీడీపీ నాయకుల చేతిలో దారుణ హత్యకు గురైన చెన్నారెడ్డి కుటుంబాన్ని 2019 జనవరి9న అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించారు. న్యాయం చేస్తామని భరోసానిచ్చారు. అన్ని విధాలుగా అండగా ఉండాలని కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి సూచించారు.

సూరి మద్దతుతోనే రెచ్చిపోయారు..

ఎర్రగుంట చెన్నారెడ్డి బడన్నపల్లిలో వైఎస్సార్‌సీపీ ముఖ్యనాయకుడు. ప్రజల మద్దతు పుష్కలంగా ఉండేది. ఇదే గ్రామంలో కపాడం సూర్యనారాయణ, కపాడం గంగాధర్ టీడీపీలో ఉండేవారు. పార్టీల పరంగా చెన్నారెడ్డి అంటే వీరికి పొసగేది కాదు. గ్రామంలో రామాలయ ధ్వజ స్తంభప్రతిష్టాపన విషయంలో భేదాభిప్రాయాలు రావడంతో ఇరువురి మధ్య విభేదాలు చోటు చేసుకున్నాయి. దీనికి తోడు 2018 జనవరిలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్ర ధర్మవరం మండలం చేరుతుండటంతో గ్రామంలో పార్టీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పాటు పార్టీ కార్యక్రమాలను చెన్నారెడ్డి చురుకుగా చేపట్టారు. గ్రామం మొత్తం చెన్నారెడ్డికే మద్దతు పలుకుతూ ఉండటంతో టీడీపీ నాయకులు జీర్ణించుకోలేకపోయారు. ఈ క్రమంలోనే అప్పటి ఎమ్మెల్యే సూరి టీడీపీలో హార్డ్‌కోర్, సాఫ్ట్‌కోర్ కమిటీలను ఏర్పాటు చేసి 'వైఎస్సార్‌సీపీ నాయకులను కొట్టండి, చంపండి' అంటూ ఆదేశాలు జారీ చేసి మద్దతు తెలపడంతో టీడీపీ నాయకులు రెచ్చిపోయారు. చెన్నారెడ్డిని హతమార్చేందుకు కపాడం గంగాధర్, సూర్యనారాయణ తమ సమీప బంధువులతో కలసి పక్కా స్కెచ్ వేసి వేటకొడవళ్లతో కిరాతకంగా హతమార్చారు. వరదాపురం సూరి భరోసాతోనే టీడీపీ నాయకులు హత్యకు తెగబడ్డారని మృతుని బంధువులు ఆరోపించారు. తీరా టీడీపీ ప్రభుత్వం అధికారం కోల్పోగానే సూరి రెండునెలలు గడవ కుండానే పార్టీ మారి టీడీపీ శ్రేణులకు షాక్ ఇచ్చాడు.

సుదీర్ఘ విచారణ అనంతరం సంచలన తీర్పు

చెన్నారెడ్డి హత్య కేసుపై అనంతపురం న్యాయస్థానం సుదీర్ఘ విచారణ జరిపింది. హత్యకు సంబంధించి సాక్షులను, ఆధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితులైన టీడీపీ నాయకులు కపాడం గంగాధర్, కపాడం సూర్యనారాయణ, దాసరిపెద్దన్న, దాసరి శివయ్య, దాసరి గంగాప్రసాద్, కపాడం నాగరాజుకు జీవితకాల కఠిన కారాగార శిక్ష రూ.5 వేలు జరిమానా విధిస్తూ జడ్జి శ్రీనివాస్ తీర్పునిచ్చారు.

పోరాటం ఫలించింది



నా భర్త ఏ తప్పు చేయకున్నా టీడీపీ నాయకులు దారుణంగా హత్య చేశారు. భర్త మరణంతో నేను, నా ఇద్దరు కూతుళ్లు దిక్కులేని వారమయ్యాం. న్యాయస్థానంలో మా పోరాటం ఫలించింది. ఈ తీర్పు ద్వారా ఇకపై ఎవరూ ఇలాంటి చర్యలకు పాల్పడరని ఆశిస్తున్నా.
– ఎర్రగుంట భాగ్యమ్మ, చెన్నారెడ్డి భార్య, బడన్నపల్లి

చదువుకోవాలనుంది నాన్న..

- వద్దన్నా పెళ్లి చేసుకోవాలంటూ ఒత్తిడి
- మనస్తాపంతో యువతి బలవన్మరణం
- బాలికల దినోత్సవం రోజున ఘటన
- రాకెట్లలో విషాదం



మృతురాలు కవిత

ఉరవకొండ: ఆ అమ్మాయికి చదువంటే ఇష్టం. డిగ్రీ పూర్తయ్యాక ఉద్యోగం చేయాలనుకుంది. అయితే తల్లిదండ్రులు పెళ్లి చేయాలని నిశ్చయించారు. తన అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకపోవడంతో మనస్తాపం చెందిన అమ్మాయి ఆత్మహత్య చేసుకుంది. జాతీయ బాలికల దినోత్సవం రోజున ఈ ఘటన రాకెట్లలో విషాదం నింపింది. పోలీసులకందిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. రాకెట్లకు చెందిన రమేష్, సరస్వతి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. పెద్ద కుమార్తె కవిత (20) ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతోంది. చదువంటే ఎంతో ఇష్టం. పేదరికం ఇబ్బందులను కళ్లారా చూసిన ఈమె బాగా చదివి ఉద్యోగం చేయాలని కలలు కంది. అయితే తండ్రి ఉన్నపళంగా బంధువుల అబ్బాయితో రెండు రోజుల కిందట పెళ్లి చూపులు ఏర్పాటు చేశాడు. ఆ తంతు పూర్తయ్యాక కవిత తల్లిదండ్రులతో తన నిర్ణయం చెప్పింది. తనకు చదువుకోవాలని ఉందని, ఇప్పుడే పెళ్లి వద్దని తెలిపింది. తాను డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగంలో చేరాక పెళ్లి చేయాలని ప్రాధేయపడింది. అయితే తల్లిదండ్రులు వినలేదు. మంచి సంబంధమని, చేసుకుంటే నీ జీవితం బాగుంటుందని బలవంతపెట్టారు. తను కన్న కలలు కల్లలవుతున్నాయని మనస్తాపం చెందిన కవిత సోమవారం అర్ధరాత్రి ఎలుకల మందు తాగింది. రెండు గంటల తర్వాత వాంతులు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు గమనించి కవితను ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా మారడంతో అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. అయినా ప్రయోజనం లేకపోయింది. మంగళవారం తెల్లవారుజామున కవిత మృతి చెందింది. పోస్టుమార్టం అనంతరం రాకెట్లలో అంత్యక్రియలు పూర్తి చేశారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు



ఎంపికైన క్రీడాకారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో అరుణ, కళ్యాణి, సాయి, పావని, పూజిత, గోపినాథ్, షాహిద్ ఉన్నారు. వీరిని జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖాధికారి కృష్ణయ్య, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి రవికుమార్, కో–ఆర్డినేటర్ నాగరాజు, పీడీలు నాగరాజు, వేణు, రమేష్, శివ, చంద్రశేఖర్ అభినందించారు.

ద్విచక్ర వాహనం ఢీ - వృద్ధుడి మృతి



మృతుడు వరలక్ష్మయ్య

తాడిపత్రి: ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రిలోని నందలపాడుకు చెందిన వరలక్ష్మయ్య.. స్థానిక కడప రహదారిలో ఉన్న టాటా షోరూంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి 10 గంటలకు విధులకు వెళుతుండగా షోరూం ఎదుట వేగంగా ద్విచక్ర వాహనంపై దూసుకొచ్చిన ఓ బాలుడు ఢీకొన్నాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన వరలక్ష్మయ్యను స్థానికులు వెంటనే తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతిచెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు రూరల్ హెడ్‌కానిస్టేబుల్ రఫీ తెలిపారు.

ఆన్‌లైన్‌లో టోకరా!

- పెట్రోల్ బంక్ రిటైల్ ఔట్‌లెట్ల ఏర్పాటు పేరుతో మోసం
- దరఖాస్తు పేరుతో రూ.1.25 లక్షలు చెల్లించిన బాధితులు
- సైబర్ నేరగాడి ఖాతాకు బదిలీ అయిన సొమ్ము

రాప్తాడు రూరల్: పెట్రో ఉత్పత్తుల రిటైల్ ఔట్‌లెట్ల ఏర్పాటు పేరుతో సైబర్ నేరగాళ్లు విసిరిన వలలో జిల్లాకు చెందిన ఇద్దరు చిక్కుకుని రూ.1.25 లక్షలు పోగొట్టుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం రూరల్ పరిధిలోని విద్యారణ్యనగర్‌కు చెందిన సోదరులిద్దరు కురుగుంట, వడ్డుపల్లి ప్రాంతాల్లో పెట్రోల్ బంక్ ఔట్‌లెట్ ఏర్పాటు కోసం ఈ నెల 21న ఆన్‌లైన్‌లో ద్వారా దరఖాస్తు చేసుకున్నారు.petrolpum pksk. com వెబ్‌సైట్ తెరిచి వివరాలు పొందుపరిచి ఓకే బటన్ నొక్కారు. వెంటనే వచ్చిన యూపీఐపై క్లిక్ చేయగా క్యూఆర్ కోడ్ కనిపించింది. అక్కడ ఒక్కో దరఖాస్తుకు రూ.25వేలు చెల్లించాలని ఉండడంతో మొత్తం 5 దరఖాస్తులకు రూ.1.25 లక్షలు చెల్లించారు. అనంతరం ఇదే విషయాన్ని తమకు తెలిసిన వారికి వివరించడంతో దరఖాస్తు గడువు ముగిసిందని వారు తెలిపారు. దీంతో అనుమానం వచ్చి వెబ్‌సైట్ తెరిచి చూడగా మయాంక్‌జోషి అనే వ్యక్తి ఖాతాకు నగదు బదిలీ అయినట్లు కనిపించింది. దీంతో మయాంక్ జోషి నంబర్‌ను ఆరా తీయగా నోయిడాకు చెందినదిగా తేలింది. దీంతో తాము మోసపోయినట్లుగా గుర్తించిన బాధితులు వెంటనే ఆన్‌లైన్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై అనంతపురం రూరల్ సీఐ విజయభాస్కరగౌడ్ మాట్లాడుతూ.. పెట్రోల్ బంక్ రిటైల్ ఔట్‌లెట్ ఏర్పాటు చేయాలనుకునేవారు సంబంధిత అధికారులను ముందుగా సంప్రదించి, ఒరిజనల్ వెబ్‌సైట్ వివరాలు తీసుకుని దరఖాస్తు చేసుకోవాలన్నారు. లేకపోతే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడే ప్రమాదముందన్నారు. ఎవరైనా మోసపోతే 1930 టోల్‌ఫ్రీ నంబరు లేదా cybercrime. gov.in ద్వారా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. తాజా ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.



పరుగుతో సమానత్వానికి నాంది





అల్ట్రా మారథాన్ రన్‌ను ప్రారంభిస్తున్న అన్నే ఫెర్రర్, మాంఛో ఫెర్రర్, విశాల ఫెర్రర్, అనంతపురం నుంచి ప్రారంభమైన అల్ట్రా మారథాన్ పరుగు

- ఆర్డీటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్

అనంతపురం సప్తగిరి సర్కిల్: పరుగుతో సమానత్వానికి నాంది పలుకుతున్నామని ఆర్డీటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్ అన్నారు. మంగళవారం సాయంత్రం అనంతపురం ఆర్డీటీ ప్రధాన కార్యాలయం నుంచి ఎనిమిదో అల్ట్రా మారథాన్ రన్ నిర్వహించారు. ముఖ్య అతిథులు అన్నే ఫెర్రర్‌తో పాటు ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ విశాల ఫెర్రర్, స్పెయిన్‌కు చెందిన జువాన్ మాన్యువల్ ప్రారంభించిన ఈ పరుగులో స్పెయిన్, జర్మనీ, ఇండియా క్రీడాకారులు పాల్గొన్నారు. మొత్తం నాలుగు బృందాలుగా విడిపోయి.. ఒక్కో బృందం 42 కిలోమీటర్ల చొప్పున మొత్తం 170 కిలోమీటర్ల మేర ఈ పరుగు కొనసాగుతుంది. కలెక్టరేట్, చెరువుకట్ట మీదుగా బుక్కరాయసముద్రం, రెడ్డిపల్లి మీదుగా బుధవారం సాయంత్రం బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి పరుగు చేరుకుంటుంది. అక్కడ ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహానికి నివాళులర్పిస్తారు. ఈ రన్ ద్వారా ఆర్డీటీ తన కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలకు చెందిన కుటుంబాలకు అండగా నిలుస్తోంది. కార్యక్రమంలో ఆర్డీటీ చైర్మన్ తిప్పేస్వామి, డైరెక్టర్లు దశరథ్, నిర్మల్‌కుమార్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాగుదారులకు హక్కుల కల్పనపై అధ్యయనం



కర్ణాటక రెవెన్యూ శాఖ మంత్రి అశోక్‌తో చర్చిస్తున్న కమిటీ సభ్యులు (చిత్రంలో) ఎమ్మెల్యే పద్మావతి

శింగనమల: అసైన్డ్ భూములపై సాగుదారులకు హక్కులు కల్పించే అంశంపై అధ్యయనానికి కర్ణాటక, తమిళనాడు పర్యటనకు ఏపీ ప్రభుత్వం తరఫున వెళ్లిన కమిటీలో శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి చోటు దక్కింది. ఈ కమిటీలో నలుగురు మంత్రులు, 9 మంది ఎమ్మెల్యేలున్నారు. రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అధ్యక్షతన కమిటీ రెండు రాష్ట్రాల్లో పర్యటించింది. 23న చెన్నైలోని సెక్రటేరియట్‌లో ఆ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి రామచంద్రన్‌తో కమిటీ సభ్యులు కలసి మాట్లాడారు. 24న కర్ణాటక రెవెన్యూ శాఖ మంత్రి అశోక్‌ను బెంగళూరులోని సెక్రటేరియట్‌లో కలిశారు.

టీడీపీ అధికారంలోకి రావడం భ్రమ

- లోకేష్ పాదయాత్రతో ఒరిగేదేమీ లేదు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య

అనంతపురం సప్తగిరి సర్కిల్: నారా లోకేష్ పాదయాత్రతో ప్రజలకు చేకూరే మంచి ఏదీ ఉండదని, ఆయన పాదయాత్ర చేసినంత మాత్రాన టీడీపీ అధికారంలోకి వస్తుందనుకోవడం కేవలం భ్రమేనని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రత్యక్ష ఎన్నికల్లో కనీసం సర్పంచ్‌గా కూడా గెలవలేని వ్యక్తి రాజ్యాధికారం కోసం పాదయాత్ర చేస్తాననడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దొడ్డి దారిన మంత్రి పదవిని చేజిక్కించుకున్న లోకేష్.. తన హయాంలో ప్రజలకు చేసిన మేలు ఏమిటో చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. తాను దోచుకోవడం, తన పార్టీ వాళ్లకు దోచిపెట్టడం తప్ప నారా లోకేష్ సాధించిన గొప్ప ఏదీ లేదన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో ప్రజలు ప్రాణాలు గుప్పిట పట్టుకుని నానా కష్టాలు పడుతుంటే చంద్రబాబు, లోకేష్ కనీసం ఇటు వైపు చూడలేదన్నారు. సభ ఎక్కడ పెడతారు, ఎంత మంది వస్తారని అంచనా వేశారు, పాదయాత్ర రూట్‌మ్యాప్ ఏమిటి అనే వివరాలను ప్రభుత్వానికి అందించకుండా కేవలం ప్రజలను మభ్య పెట్టేందుకు పాదయాత్రను అడ్డుకుంటున్నారంటూ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇలాంటి దద్దమ్మ పాదయాత్రను అడ్డుకోవాల్సిన అవసరం తమ ప్రభుత్వానికి లేదన్నారు. పాదయాత్ర కాదు కదా పొర్లుదండాల యాత్ర చేసినా వైఎస్సార్‌సీపీకి ఎలాంటి నష్టమూ రాదన్నారు.

పెద్దవడుగూరులో పర్యటించిన కేంద్ర బృందం



ఉపాధి రికార్డులు పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

పెద్దవడుగూరు: కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై పరిశీలన చేసేందుకు వచ్చిన కేంద్ర బృందం మంగళవారం పెద్దవడుగూరులో పర్యటించింది. తొలుత మహిళా సంఘాల సభ్యులతో స్థానిక అధికారులతో కలసి బృందం సభ్యులు ప్రదీప్‌పైక్రాయ్, సంతోష్‌ప్రధాన్ సమావేశమై, కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిపై ఆరా తీశారు. ఉపాధి పథకం ద్వారా చేపట్టిన పండ్ల తోటల పెంపకాన్ని పరిశీలించారు. రైతులకు బిల్లులు సకాలంలో అందుతున్నాయో.. లేదో అడిగి తెలుసుకున్నారు. బిల్లులు మంజూరైన రికార్డులు, గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్లు, గృహాలను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి, జెడ్పీ సీఈఓ భాస్కరరెడ్డి, ఇన్‌చార్జ్ డీపీఓ సుమన జయంతి, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఈఓఆర్డీ నాగేశ్వరశాస్త్రి, ఏపీయం ఈశ్వరయ్య, ఏపీఓలు పుల్లారెడ్డి, జయరామిరెడ్డి, మండల పీఆర్ ఏఈ సురేష్‌రెడ్డి, శింగనమల పీఆర్ ఏఈ వరప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు మురళీకృష్ణారెడ్డి, ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

గుత్తి రూరల్: తొండపాడు గ్రామంలో బొలికొండ రంగనాథ స్వామి ఆలయ హుండీ కానుకల లెక్కింపు మంగళవారం నిర్వహించారు. స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఆరు నెలలా ఇరవై రోజులకు గాను రూ.9,57,077 ఆదాయం వచ్చిందని ఈఓ దేవదాసు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పెద్దవడుగూరు: మండలంలోని వీరేపల్లి సమీపంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వివరాలు... మంగళవారం తెల్లవారుజామున వీరేపల్లి సమీపంలో రోడ్డు డివైడర్‌ను ఢీకొని ఓ ఆటో బోల్తాపడింది. ఘటనలో యాడికి మండలం ఓబుళాపురం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ రాముడు తీవ్రంగా గాయపడ్డాడు. జాతీయ రహదారిపై పడి ఉన్న మృతదేహాన్ని గుర్తించి ఆటో డ్రైవర్ వాహనాన్ని పక్కకు మళ్లించడంతో డివైడర్‌ను ఢీకొన్నట్లు తెలుస్తోంది. క్షతగాత్రుడి నుంచి సమాచారం అందుకున్న పెద్దవడుగూరు ఎస్‌ఐ రాజశేఖరరెడ్డి, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి ముఖం గుర్తు పట్టలేనంతగా నుజ్జునుజ్జైంది. మృతుడి కుడిచేతిపై సుకన్య అనే పేరు పచ్చబొట్టు ఉంది. మృతుడి వివరాలు తెలిసిన వారు సంప్రదించాలని ఎస్‌ఐ (94407 96826) కోరారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు భూదానం

- 1.3 ఎకరాల భూమిని దానంగా ఇచ్చిన రైతు దంపతులు



తహసీల్దార్‌కు అంగీకార పత్రాన్ని అందజేస్తున్న రామాంజనేయులు, విజయలక్ష్మి (చిత్రంలో) సర్పంచ్ రమేష్‌రెడ్డి

గుంతకల్లు రూరల్: రాష్ట్రాభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రమిస్తున్న తీరు, ప్రజా సమస్యల పరిష్కారానికి గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి (వైవీఆర్) చేస్తున్న కృషిని చూసి స్ఫూర్తి పొందిన రైతు దంపతులు.. తమ గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ఏకంగా 1.3 ఎకరాల పట్టా భూమిని ప్రభుత్వానికి స్వాధీనం చేశారు. రూ.కోట్లు ఆర్జించినా స్వలాభం కోసం పాకులాడే వ్యక్తులున్న నేటి సమాజంలో గ్రామాభివృద్ధి కోసం తమకున్న 4.5 ఎకరాల్లో రూ.15 లక్షలు విలువ చేసే 1.3 ఎకరాల భూమిని నయాపైసా ప్రతిఫలం ఆశించకుండా ప్రభుత్వానికి అందజేసిన నిరుపేద రైతు దంపతుల ఔదార్యాన్ని ఎమ్మెల్యే వైవీఆర్‌తో పాటు మండల ప్రజలు కొనియాడుతున్నారు.

లోఓల్టేజీ సమస్యతో ఇబ్బందులు

25 గ్రామ పంచాయతీలు, 39 గ్రామాలున్న గుంతకల్లు మండలానికి కేవలం మూడు సబ్‌స్టేషన్ల నుంచి విద్యుత్ సరఫరా జరుగుతోంది. దీంతో లోఓల్టేజీ సమస్య తలెత్తి ఎన్నో ఏళ్లుగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతూ వచ్చారు. మోటర్లు తరచూ కాలిపోతుండటంతో పంట చేతికందక అవస్థలు పడుతున్న రైతులకు మోటర్ల మరమ్మతు అదనపు భారంగా మారింది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు కొత్త విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటుపై ఎమ్మెల్యే వైవీఆర్ దృష్టి సారించారు. గుంతకల్లు మండలంలోని ఓబుళాపురం, నెలగొండ, పామిడి మండలంలోని పాల్యం, గుత్తి మండలంలోని కరిడికొండ, గుంతకల్లు పట్టణంలోని సత్యనారాయణపేటలో కొత్తగా విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలంటూ ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే చొరవతో తొలివిడతగా ఓబుళాపురం, పాళ్యం గ్రామాలకు నూతన సబ్ స్టేషన్లు మంజూరయ్యాయి.

భూదానానికి ముందుకు వచ్చిన రైతు దంపతులు

నూతన సబ్‌స్టేషన్ మంజూరు కావడంతో ఓబుళాపురం, చుట్టుపక్కల పది గ్రామాల ప్రజల్లో హర్షం వ్యక్తమైంది. అయితే గ్రామంలోఅనువైన, అవసరమైన ప్రభుత్వ భూమి లేకపోవడంతో సబ్‌స్టేషన్ ఏర్పాటు ప్రశ్నార్థకంగా మారింది. ఈ పరిస్థితుల్లో అదే గ్రామానికి చెందిన రైతు వరికోటి రామాంజనేయులు, విజయలక్ష్మి దంపతులు 1.3 ఎకరాల భూమిని దానంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు అంగీకార పత్రాన్ని మంగళవారం ఉదయం గ్రామ సర్పంచ్ రమేష్‌రెడ్డితో కలసి తహసీల్దార్ రాముకు అందజేశారు. ఈ సందర్భంగా రైతు దంపతులు మాట్లాడుతూ.. ఈ రోజు తాము ఆనందంగా ఉన్నామంటే అది జగన్ ప్రభుత్వం చలువేనన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేపడుతున్న అభివృద్ధి పనులు చూసి స్ఫూర్తి పొంది ప్రజలకు మంచి జరగాలని ఆకాంక్షిస్తూ భూమిని ఉచితంగా అందజేసినట్లు వివరించారు. గ్రామ సర్పంచ్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ స్థలం గ్రామ పరిసరాల్లో ఎక్కడేగాని లేదన్నారు. ఇలాంటి తరుణంలో తన పేదరికాన్ని సైతం పక్కనబెట్టి గ్రామాభివృద్ధికి 1.3 ఎకరాల భూమిని ఉచితంగా అందజేసిన రైతు రామాంజనేయులు, విజయలక్ష్మి దంపతుల ఔదార్యాన్ని మాటల్లో వర్ణించలేమన్నారు.

జేసీ అనుచరులపై చర్యలకు డిమాండ్



నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు

తాడిపత్రి టౌన్: దళిత నాయకులపై దాడులకు తెగబడి, కిడ్నాప్‌కు ప్రయత్నించిన జేసీ అనుచరులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తాడిపత్రిలోని అంబేడ్కర్ సర్కిల్‌లో మంగళవారం నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమానికి నేతృత్వం వహించిన ఎమ్మార్పీఎస్ నాయకుడు పెద్దిరాజు మాట్లాడుతూ... తాడిపత్రిలోని శ్రీనివాసపురం బైపాస్ రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో దండోరా కార్యాలయ నిర్మాణం చేపట్టిన ఎమ్మార్పీఎస్ నాయకులపై జేసీ అనుచరులు దాడి చేసి, కారులో బలంతంగా ఎక్కించుకుని వెళ్లేందుకు ప్రయత్నించారన్నారు. జేసీ అనుచరుల దౌర్జన్యం, అరాచకాలు అరికట్టాలని, దళితులపై దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని, ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు బాల చంద్రుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ సీబీ రవి, నాయకులు మనోహర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సవీరాలో నర్సు అనుమానాస్పద మృతి



పద్మ (ఫైల్)

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలో ఓ యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు.. నగర శివారులోని టమాట మండీ వద్ద ఉన్న బీజేపీ కొట్టాలలో నివాసముంటున్న సునీత, కేశప్ప దంపతుల కుమార్తె పద్మ(23).. కిమ్స్ సవీరా ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తోంది. సోమవారం రాత్రి విధులకు హాజరైన ఆమె మంగళవారం వేకువ జాము 2.22 గంటలకు ఎమర్జెన్సీ గదిలోని ఓ బెడ్‌పై నిద్రించింది. తెల్లవారుజాము 4.45 గంటలకు ఆమెను నిద్రలేపేందుకు తోటి ఉద్యోగి వెళ్లింది. ఆ సమయంలో అచేతనంగా పడి ఉన్న పద్మను గమనించి.. విషయాన్ని వెంటనే ఆస్పత్రి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లింది. అప్రమత్తమైన వైద్యులు.. పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఆస్పత్రికి వద్దకు చేరుకుని కుమార్తె మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. ఎంతో ఆరోగ్యంగా ఉండే తమ బిడ్డ మృతి చెందిందంటే నమ్మశక్యంగా లేదని అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై అనుమానాస్పద మృతికింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు అనంతపురం నాల్గో పట్టణ పోలీసులు తెలిపారు. కాగా, విషయం తెలుసుకున్న ఎస్సీ, ఎస్టీ జేఏసీ నేతలు సాకే హరి, తదితరులు ఆస్పత్రి వద్దకు చేరుకుని పద్మ మృతదేహాన్ని పరిశీలించారు. ఆమె మృతికి కారకులెవరో తెలపాలంటూ ఆస్పత్రి వర్గాలను డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితం చిన్నారికి వైద్యం అందించే అంశంపై పద్మను యాజమాన్యం భయభ్రాంతులకు గురి చేసిందని, తప్పు లేకపోయినా లిఖిత పూర్వకంగా సంజాయిషీ తీసుకున్నారని మండిపడ్డారు. మరుసటి రోజు కూడా ఆమెను డైరెక్టర్ల సమావేశానికి రప్పించుకుని రాత్రి 9 గంటల వరకూ నిల్చోబెట్టి అవమానించారని మండిపడ్డారు. పద్మ మృతిపై లోతైన దర్యాప్తు చేపట్టి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆందోళన చేపట్టారు. ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

అనంతలో హత్య.. కర్ణాటకలో మృతదేహం!

- హత్యకేసులో బెంగళూరులో పట్టుబడ్డ న్యాయవాది, మరొకరు

యశవంతపుర (బెంగళూరు): వ్యక్తి హత్య కేసులో అనంతపురం జిల్లాకు చెందిన న్యాయవాదిని బెంగళూరు పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను బెంగళూరులోని విజయపుర పోలీసులు వెల్లడించారు. ఈ నెల 2న దేవనహళ్లి తాలూకా విజయపుర వద్ద ఓ వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. తొలుత గుర్తు తెలియని వ్యక్తి మృతి కింద కేసు నమోదు చేసిన పోలీసులు.. పోస్టు మార్టం అనంతరం హత్యగా గుర్తించారు. ఈ క్రమంలో కేసు నమోదు చేసి, లోతైన దర్యాప్తు చేపట్టిన మృతదేహం లభ్యమైన ప్రాంతానికి కొద్ది దూరంలో పడిన రెండు చేతి వేళ్లను తీసుకుని ముద్రల ఆధారంగా హతుడు అనంతపురం జిల్లా కంబదూరు పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఓ కేసులో నిందితుడిగా ఉన్నట్లు తేలింది. దీంతో కూపీ లాగితే డొంక కదిలింది. ముత్యాలప్ప, కళ్యాణదుర్గం ప్రాంతానికి చెందిన న్యాయవాది నగేష్ మధ్య గొడవలున్నట్లుగా నిర్ధారణ అయింది. ఈ క్రమంలో నగేష్‌ను పోలీసులు తమదైన శైలిలో విచారణ చేయడంతో నేరం బయటపడింది. తమ మధ్య ఉన్న గొడవ కారణంగా ముత్యాలప్పను హత్య చేయాలని నగేష్ భావించాడు. ఈ క్రమంలోనే అనంతపురానికి చెందిన సోమశేఖర్‌కు డబ్బులిచ్చి ముత్యాలప్ప హత్యకు పథకం రచించాడు. ఇందులో భాగంగా ఈ నెల 1న ముత్యాలప్పను అనంతపురానికి సోమశేఖర్ రప్పించుకుని పుల్లుగా మద్యం తాపి, కొట్టి హతమార్చాడు. అనంతరం కారులో మృతదేహాన్ని వేసుకుని దేవనహళ్లి తాలూకా విజయపుర పోలీసుస్టేషన్ పరిధిలోని బుళ్లహళ్లి గ్రామం సమీపంలో పడేశాడు. హతుడి ఆనవాళ్లు లభ్యంకాకుండా ముఖం మీద బండరాయి వేసి నుజ్జునుజ్జు చేశాడు. వేలిముద్రలు దొరకకుండా వేళ్లను కత్తిరించి దూరంగా పడేశాడు. ఈ వేళ్లే నిందితులను పోలీసులకు పట్టించాయి. నగేష్, సోమశేఖర్‌ను పోలీసులు అరెస్ట్ చేసి, కారును సీజ్ చేశారు.

వివాహిత బలవన్మరణం



కళావతి (ఫైల్)

యాడికి: అనారోగ్య పరిస్థితులను తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... యాడికిలోని కోనరోడ్డులో నివాసముంటున్న శ్రీనివాసులు, రత్నమ్మ దంపతుల చిన్న కుమార్తె కళావతి(23)... ఆరేళ్ల క్రితం ధర్మవరానికి చెందిన బాలకృష్ణను ప్రేమించి పెళ్లి చేసుకుంది. అనంతరం కోనరోడ్డులోనే నివాసముంటూ మగ్గం నేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి నాలుగేళ్ల వయస్సున్న కుమార్తె, ఏడాది వయసున్న కుమారుడు ఉన్నాడు. మూడేళ్లుగా ఛాతిలో నొప్పితో కళావతి బాధపడుతోంది. కుటుంబసభ్యులు పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. అయినా నయం కాలేదు. దీంతో మనస్తాపం చెందిన కళావతి మంగళవారం ఉదయం 11 గంటలకు కొత్తి మీర తీసుకురావాలంటూ భర్తను బజారుకు పంపి ఇంట్లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కాసేపటి తర్వాత ఇంటికి చేరుకున్న భర్త... ఉరికి వేలాడుతున్న భార్యను గమనించి కేకలు వేశాడు. చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని కళావతిని కిందుకు దించి ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి తండ్రి శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పెన్నహోబిల క్షేత్రం నూతన పాలక మండలి ఏర్పాటుకు అనుమతులు జారీ

ఉరవకొండ రూరల్: ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి గాంచిన పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం నూతన పాలక మండలి ఏర్పాటుకు హిందూ దేవాదాయశాఖ అనుమతులు జారీ చేసింది. ఈ నెల 22న అనుమతులు జారీ అయినట్లు ఆలయ ఈఓ కె.విజయ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ప్రకటన వెలువడిన రోజు నుంచి 20 రోజుల్లోపు దరఖాస్తులను కర్నూలులోని హిందూ దేవాదాయశాఖ ఉపకమిషనర్ కార్యాలయానికి పంపాలి.

క్లుప్తంగా

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

అనంతపురం క్రైం: నగరంలోని 39వ డివిజన్‌లో బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. డివిజన్‌లోని లక్ష్మీనగర్ సచివాలయ పరిధిలోని వడ్డే కాలనీ నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

సిండికేట్ నగర్‌లో....

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ సిండికేట్‌నగర్‌లో బుధవారం ఉదయం 8 గంటలకు రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం చేపట్టనున్నారు. మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొనాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

ఎస్వీ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థులతో ఎస్వీ డిగ్రీ కళాశాల వైస్ చైర్మన్ చక్రధర్ రెడ్డి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అటల్ ఇంక్యుబేషన్ కేంద్రంలో ఇటీవల నిర్వహించిన స్టార్టప్ జాతరలో ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. నాలుగు స్టార్టప్ ప్రాజెక్ట్‌లు ప్రొటోకాల్ దశకు చేరుకున్నట్లు ఎస్వీ డిగ్రీ , పీజీ కళాశాల వైస్ చైర్మన్ ఎస్.చక్రధర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు.

ప్లాస్టిక్ నియంత్రణకు కృషి చేయాలి

అనంతపురం క్రైం: ప్లాస్టిక్ నియంత్రణకు గట్టిగా పని చేయాలని కమిషనర్ కే భాగ్యలక్ష్మి నగరపాలక సంస్థ, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ నుంచి కమిషనర్ జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 26 నుంచి ప్లాస్టిక్ బ్యానర్లను పూర్తిగా నిషేధించామని, ప్రభుత్వ మార్గదర్శకాలకనుగుణంగా పని చేయాలన్నారు. ఎవరైనా ప్లాస్టిక్ బ్యానర్లు ఉత్పత్తి, వినియోగం చేస్తే కేసు నమోదు చేస్తామన్న విషయాన్ని అడ్వైర్‌టైజ్‌మెంట్ ఏజెన్సీలకు సూచించాలన్నారు. ఇష్టారాజ్యంగా విధులు నిర్వర్తిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి ఒక్కరూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు.

నర్సింగ్ సూపరింటెండెంట్‌కు సన్మానం

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా ఎన్‌జీఓ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రభుత్వ సర్వజనాస్పత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ మంజును మంగళవారం సన్మానించారు. ఇటీవల నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఈసందర్భంగా ఆమెను నర్సింగ్ సిబ్బంది కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రమోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, జమీలా బేగం, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, జాయింట్ సెక్రటరీలు లింగమేష్, శోభ, నగర కార్యదర్శి శ్రీధర్ బాబు, ఉపాధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

అటల్ ఇంక్యుబేషన్‌తో అవగాహన ఒప్పందం



అవగాహన ఒప్పందాలను మార్చుకుంటున్న వీసీ రామకృష్ణారెడ్డి, డాక్టర్ రామకృష్ణా రెడ్డి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అటల్ ఇంక్యుబేషన్ కేంద్రంతో రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాల నంద్యాలతో అవగాహన ఒప్పందం కుదిరింది. ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి, అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం సీఈఓ శివ కిరణ్‌లతో రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రామకృష్ణా రెడ్డిలు పరస్పరం అవగాహన పత్రాలను మార్పు చేసుకున్నారు. ఆవిష్కరణల పారిశ్రామిక విధానంపై వచ్చే ఏడాది నుంచి రామకృష్ణ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులకు నూతన ఔత్సాహిక పారిశ్రామిక విధానంపై శిక్షణ కల్పించనున్నారు. అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్. నాగభూషణ రాజు పాల్గొన్నారు.

నీటి ట్యాంకులు శుభ్రం చేయాలి

అనంతపురం క్రైం: నగరంలో నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని నీటి సరఫరా విభాగం సిబ్బందికి మేయర్ వసీం సూచించారు. మంగళవారం నగరంలోని పాతూరులోని నీటి ట్యాంకును మేయర్ పరిశీలించారు. ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్నారా? క్లోరినేషన్ ప్రక్రియను పక్కాగా చేపడుతున్నారా అని సిబ్బందిని ఆరా తీశారు. నగర ప్రజలకు శుద్ధి జలం అందించేందుకు అంకితభావంతో పని చేయాలన్నారు. అనంతరం 17వ సచివాలయాన్ని మేయర్ పరిశీలించారు. ముగ్గురు సిబ్బంది మాత్రమే ఉండడంతో అదనపు కమిషనర్ రమణారెడ్డికి మేయర్ ఫోన్ చేసి ఆరా తీశారు. అనంతరం మేయర్ మూవ్‌మెంట్ రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. కార్పొరేటర్లు బాబాఫక్రుద్దీన్, ఇస్సాక్, అనిల్‌కుమార్ రెడ్డి ఉన్నారు.

బాలికల భద్రతకు పెద్దపీట

- మహిళా,శిశు సంక్షేమశాఖమంత్రి ఉషాశ్రీ చరణ్

నంతపురం సెంట్రల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాలికల భద్రతకు పెద్దపీట వేస్తున్నారని రాష్ట్ర మహిళా,శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషాశ్రీచరణ్ తెలిపారు. మంగళవారం అంతర్జాతీయ బాలికాదినోత్సవ కార్యక్రమాన్ని ఆర్ట్స్‌కళాశాలలో నిర్వహించారు. మంత్రి ఉషాశ్రీచరణ్ మాట్లాడుతూ 'పెళ్లి వద్దు.. చదువే ముద్దు' నినాదంతో ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలు అరికట్టేందుకు నడుంబిగించాలన్నారు. బాలికల ఉజ్వల భవిష్యత్‌కోసం దేశంలో ఎక్కడా లేని విధంగా రక్షణ చట్టాలు, సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశ పెట్టి, బాలకల భద్రతకు భరోసా కల్పిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని కొనియాడారు. బాలికల రక్షణ, ఎదుగుదల, ఆరోగ్యం, విద్య తదితర అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం బాలికా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, రాష్ట్ర నాటక అకాడమీ చైర్ పర్సన్ హరిత, ఆర్టీసీ రీజినల్ చైర్‌పర్సన్ మంజుల, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, దిశ డీఎస్పీ శ్రీనివాసులు, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి, ఆర్ట్స్‌కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ అన్నాదురై, డీఎం అండ్‌హెచ్‌ఓ వీరబ్బాయి, డీవీఈఓ వెంకటరమణ నాయక్, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రామలక్ష్మి, దేవదాయశాఖ ఏసీ రామాంజనేయులు, వికలాంగుల సంక్షేమశాఖ ఏడీ అబ్దుల్‌రసూల్, డిప్యూటీ డీఈఓ పద్మ ప్రియ, ఆర్‌ఐఓ సురేషబాబు తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు భద్రత కల్పించిన ఘనత జగన్‌దే

అనంతపురం: బాలికలకు, మహిళలకు భద్రత కల్పిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు కృష్ణవేణి, శోభారాణి, జయమ్మ తదితరులు అన్నారు. మంగళవారం జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా నగరంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో కేక్ కట్ చేశారు. దిశ చట్టాన్ని తెచ్చి మహిళ భద్రతకు సీఎం వైఎస్ జగన్ పెద్ద పీట వేశారన్నారు. విద్యారంగంలోనూ బాలికలకు అవకాశం కల్పించే రీతిలో పెద్ద ఎత్తున సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు కృష్ణవేణి, శోభారాణి, జయమ్మ, భారతి, షమీమ్, శోభాభాయ్, గౌరీ, అబీదా తదితరులు పాల్గొన్నారు.

శారద నగర పాలక సంస్థ పాఠశాలలో... :

శారద నగరపాలక సంస్థ పాఠశాలలో మంగళవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారన్నారు. సమాజాభివృద్ధిలో వారి పాత్ర చాలా కీలకమన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చంద్రమోహన్ రెడ్డి, బాబాఫక్రుద్దీన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం సప్తగిరి సర్కిల్: జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని పీడియాట్రిక్ వార్డులో జాతీయ బాలికల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. పీడియాట్రిక్, గైనిక్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి పీడియాట్రిక్ హెచ్‌ఓడీ డాక్టర్ సుహాసిని, గైనిక్ హెచ్‌ఓడీ డాక్టర్ సంధ్యలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు శౌరీలు, వైద్యులు ప్రవీణ్‌దీన్‌కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో.. : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. స్థానిక కేఎస్ఎన్ బాలికల ఉన్నత పాఠశాలలో కార్యక్రమం చేపట్టారు. బాలికలకు సేవ్ ద గర్ల్ చైల్డ్ పై పెయింటింగ్ కాంపిటీషన్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఐఎంఏ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ హేమలత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యులు ప్రత్యూష, బాలకుమారి, ప్రసూన, హెచ్ఎంలు కిరణ్మయి, పద్మావతి, కల్పన, డాక్టర్ శంకర్ నారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అడ్డుకుందాం

అనంతపురం కల్చరల్: చిన్నారుల పాలిట శాపంగా మారే బాల్య వివాహాలను అడ్డుకుందామని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం స్థానిక లక్ష్మీనగర్‌లోని రెయిన్‌బో ఆశ్రమంలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. సీఆర్‌డీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సద్దాం హుస్సేన్ నేతృత్వంలో ఉదయం నగర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మహిళా,శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషాశ్రీ చరణ్, తదితరులు



బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని శారద హైస్కూల్‌లో కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకుంటున్న విద్యార్థినులు



బాలికల హాస్టల్‌లో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ మహిళలు



ర్యాలీ నిర్వహిస్తున్న రెయిన్‌బో అనాథాశ్రమ నిర్వాహకులు



మాట్లాడుతున్న పీడియాట్రిక్ హెచ్ఓడీ డాక్టర్ సుహాసిని



'సేవ్ ద గర్ల్ చైల్డ్' కార్యక్రమంలో విజేతలకు బహుమతుల ప్రదానం

అనంత వాసుల ప్రతిభ ప్రశంసనీయం

అనంతపురం కల్చరల్: అనంత వేదికగా 5వ లఘు చిత్ర వారోత్సవాలు సందడిగా సాగుతున్నాయి. మంగళవారం స్థానిక ఎస్ఎస్ ప్యారడైజ్‌లో జరిగిన పలు చిత్ర ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాన్ని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, దర్శకుడు రషీద్‌బాషా, రమేష్ నీల్ తదితరులు మాట్లాడారు. జిల్లాలో ఎంతో మంది ప్రతిభావంతులైన వారున్నారని, అనంత కీర్తిని జాతీయ స్థాయిలో చాటడానికి జిల్లా కేంద్రంలో లఘు చిత్రోత్సవం నిర్వహించడం గర్వకారణమన్నారు. అనంతరం సాగిన తెలుగు భాష - చరిత్ర లఘుచిత్ర ప్రదర్శన ఆలోచనాత్మకంగా సాగింది. డాక్టర్ సోమయాజులు, కవి షేక్ నబిర సూల్ జీవితాలపై తీసిన డాక్యుమెంటరీలు, ఖురాన్ వర్సెస్ సైన్సెస్ ప్రదర్శనలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో నిర్మాత సురేష్, ఆదరణ శైలజ, శ్రీనివాసులు, ఇంటాక్ కన్వీనర్ రాంకుమార్, అనిల్‌కుమార్‌రెడ్డి, తోట బాలన్న పాల్గొన్నారు.



చిత్రోత్సవంలో పాల్గొన్న కోగటం తదితరులు

అన్ని వర్గాల అభ్యున్నతికి విరివిగా రుణాలు

- యూనియన్ బ్యాంక్ డీజీఎం హరమోహన్‌సాహు

అనంతపురం అగ్రికల్చర్: అన్ని వర్గాల అభ్యున్నతి, అన్ని రంగాల పురోగతి కోసం తక్కువ వడ్డీ రేటుతో యూనియన్ బ్యాంకు ద్వారా విరివిగా రుణాలందిస్తున్నామని బ్యాంకు డీజీఎం హరమోహన్‌సాహు తెలిపారు. మంగళవారం నగరంలోని రామ్‌నగర్ శాఖలో ఏర్పాటు చేసిన కస్టమర్ మీట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆకర్షణీయమైన వడ్డీరేట్లతో డిపాజిట్లు సేకరించడమే కాకుండా తక్కువ వడ్డీకే ముద్ర, ఎస్‌హెచ్‌జీ, వ్యక్తిగత, ఇతరత్రా అన్ని రకాల రుణసదుపాయం కలిపిస్తున్నామన్నారు. కుటీర పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే ఔత్సాహికులకు రూ.5 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు రుణాలు ఇస్తున్నామన్నారు. నారీ శక్తి, సువిధ కింద మహిళాభ్యున్నతికి పెద్దపీట వేస్తున్నామన్నారు. ఓటీపీలు, ఆధార్, ఫోన్ నంబర్లు అంటూ సెల్‌కు వచ్చే మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో రీజినల్ హెడ్ జేకే మిశ్రా, చీఫ్ మేనేజర్లు రవిచంద్రన్, మహంతి, యదుభూషణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న యూనియన్ బ్యాంకు డీజీఎం సాహు, అధికారులు

గుజరాత్ జట్టు భారీ విజయం



రెఫరీకి జ్ఞాపికను అందిస్తున్న జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మధు

అనంతపురం సప్తగిరి సర్కిల్: బీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కల్నల్ సీకే నాయుడు అండర్-25 క్రికెట్ టోర్నీలో భాగంగా గుజరాత్, ఆంధ్ర జట్ల మ్యాచ్‌లో గుజరాత్ జట్టు భారీ విజయం సాధించింది. జిల్లా క్రికెట్ అసోసియేషన్, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యాచ్‌లో గుజరాత్ జట్టు 195 పరుగులతో విజయం సాధించింది. ఆంధ్ర జట్టు బౌలర్లలో ఆంజనేయులు 3, మహీప్, గిరినాథ్‌రెడ్డి, కేఎస్ రాజు, సత్యనారాయణరాజులు చెరో వికెట్‌ను సాధించారు. గుజరాత్ జట్టు రెండో రోజు ఓవర్‌నైట్ స్కోరు 3 వికెట్లకు 361 పరుగులతో ప్రారంభించగా, 137.2 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 511 పరుగులకు డిక్లేర్ చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆంధ్ర జట్టు 56.4 ఓవర్లలో 123 పరుగులకు కుప్పకూలింది. గుజరాత్ జట్టు నాలుగు మ్యాచ్‌లు వరుస విజయాలతో విజయ పరంపరను కొనసాగించింది. ముగింపు కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, రెఫరీ సునీల్ చతుర్వేది, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మధులు హాజరయ్యారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండల కక్కలపల్లి సమీపంలో నాగమల్లేసు (32) అనే వ్యక్తి మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు...నూతిమడుగుకు చెందిన నాగమల్లేశు (32), వరలక్ష్మీ దంపతులు. కొన్నేళ్ల కిందట ఉపాధి కోసం అనంతపురానికి వచ్చి కక్కలపల్లి సమీపంలోని నాయీ బ్రాహ్మణ కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరికి ఒక కుమారుడు, కూతురు సంతానం. నాగమల్లేశు పెల్లల ఫ్యాక్టరీలో ట్రాక్టర్ డ్రైవరుగా పని చేస్తున్నాడు. పదేళ్ల కుమారుడు గౌతం ఆర్నెళ్ల కిందట ఇంటిముందు ఊయల ఊగుతూ ప్రమాదవశాత్తూ మృతిచెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో అప్పటి నుంచి నాగమల్లేశు మనోవేదనకు గురై తాగుడుకు బానిసయ్యాడు. మంగళవారం సాయంత్రం 5 గంటల సమయంలో భార్య ఫోన్ చేయగా తాను మద్యం తాగుతున్నా ఇంతికి వస్తానని చెప్పాడు. కొద్దిసేపటికే నాగమల్లేశు టమాట మండీ వెనుకవైపు శ్మశానంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ వెంకటరమణ ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సర్వజన ఆస్పత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి



బద్దలాపురంలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ డీఈ శంకర్‌లాల్

కనగానపల్లి: నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ శంకర్‌లాల్ లబ్ధిదారులకు సూచించారు. హౌసింగ్ సిబ్బందితో కలసి మంగళవారం ఆయన మండలంలోని కనగానపల్లి, బద్దలాపురం గ్రామాల్లో పర్యటించారు. స్థానిక జగనన్న కాలనీల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. బద్దలాపురంలో పునాది దశలో ఉన్న 30 ఇళ్ల నిర్మాణాలను త్వరగా చేపట్టాలని లబ్ధిదారులకు సూచించారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సహకారంతో ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక, కంకర, సిమెంట్, పెళ్లలు, ఇతర ఇంటి నిర్మాణ సామగ్రి అంతా అందుబాటులో ఉంచుతున్నామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ చిరంజీవి, వర్క్ ఇన్‌స్పెక్టర్ షకీలా, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వీరబ్బాయి

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రైవేట్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ల క్యాలెండర్లను స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వీరబ్బాయి మంగళవారం ఆవిష్కరించారు. వైద్య రంగంలో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర చాలా కీలకమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విల్సన్, ఉపాధ్యక్షులు ధీరజ్, నాగేంద్రప్రసాద్, సత్యనారాయణరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, దామోదర్, చంద్రన్న, వేణుగోపాల్, శ్రీనివాసులు, ధనుంజయ, మనోజ్, సురేష్, శ్రీనివాసబాబు పాల్గొన్నారు.

కనీస వేతనాలివ్వాలని నిరసన

అనంతపురం సెంట్రల్: మహిళా, శిశు సంక్షేమం కోసం పనిచేస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్‌కు కనీస వేతనాలు ఇవ్వాలని యూనియన్ అధ్యక్షురాలు శకుంతల, కార్యదర్శి రమాదేవి, కోశాధికారి జమున డిమాండ్ చేశారు. మంగళవారం సమస్యల పరిష్కారం కోసం జేఎస్‌టీయూ రోడ్డులోని సీడీపీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు సంధ్య, పార్వతి, సింధు, హరిప్రియ, లక్ష్మి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఉద్యాన పంటల్లో డ్రోన్ వాడకంపై నేడు అవగాహన

అనంతపురం అగ్రికల్చర్: ఉద్యాన పంటలకు ఆశించే చీడపీడలు, తెగుళ్లు, పురుగుల నివారణకు డ్రోన్ల ద్వారా మందుల పిచికారీ చేసే అంశంపై బుధవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు జిల్లా ఉద్యాన అధికారి బి.రఘునాథరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు అనంతపురం మండలం ఆలమూరులో మారుట్ డ్రోన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రయోగాత్మక అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

రేపు ఉచితంగా ఎముకల పటుత్వ పరీక్షలు

అనంతపురం అర్బన్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈనెల 26న ఎముకల పటుత్వ పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు సుశ్రుత ఆయుర్వేద ఆస్పత్రి వైద్యుడు అశోక్ వర్ధన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక రామచంద్రనగర్ ప్రధాన రహదారిలోని ఎస్‌బీఐ ఏటీఎం ఎదురుగా ఉన్న సుశ్రుత ఆస్పత్రిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. 8919107203 నంబర్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి

ఆత్మకూరు: మండలంలోని గ్రామాల్లో జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ సుజాత తెలిపారు. మంగళవారం మండలంలోని గొరిదిండ్ల సమీపంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో భాగంగా చెక్ డ్యామ్ పనులను పరిశీలించారు.

మట్కా బీటర్ల అరెస్ట్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఎస్‌కేడీ నగరుకు చెందిన ఇద్దరు మట్కా బీటర్లను అరెస్ట్ చేసినట్ల వన్‌టౌన్ సీఐ రవిశంకరరెడ్డి మంగళవారం తెలిపారు. గుత్తి రోడ్డు సమీపంలో మట్కారాస్తున్న సులోచన, సుదేష్‌ను అరెస్ట్ చేశామన్నారు. వీరి వద్ద నుంచి రూ.30 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

డ్రిప్ పైపుల అపహరణ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనంతపురం రూరల్ పరిధిలోని ఏ నారాయణపురంలోని రైతు శ్రీనివాసరెడ్డికి చెందిన డ్రిప్ పైపులు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధిత రైతు నాల్గో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన పొలంలో కొత్తగా ఏర్పాటు చేసిన 700 మీటర్ల డ్రిప్‌పైపులను గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారన్నాడు. డ్రిప్ పైపులను ఎత్తుకెళ్లిన దొంగలను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. స్థానిక ఆటోనగర్‌కు చెందిన వ్యక్తి, ఏదో రోడ్డుకు చెందిన మరో వ్యక్తి కలిసి ఏపీలైటింగ్స్ వద్దనున్న గుజరీలో డ్రిప్ పైపులను విక్రయించినట్లు సమాచారం.

పంపనూరులో ప్రత్యేక పూజలు

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం మాఘమాసంలో భాగంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు ని ర్వహించారు. స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, ప ట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి, విశేష పూ జలు చేశారు. మంజునాథ స్వామి,పార్వతిదేవికి పూజలు చేశారు.

27న పేరూరులో సుబ్రమణ్యేశ్వర షష్టి వేడుకలు

రామగిరి: పేరూరులో ఈనెల 27న శుక్రవారం సుబ్రమణ్యేశ్వరస్వామి షష్టి వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు సుబ్బరామప్ప మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏటా మాఘశుద్ధ షష్టి రోజున పెన్నానది సమీపంలోని ఆలయంలో షష్టి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏటా జరిగే వేడుకలకు పేరూరు వాసులేగాక, ఉమ్మడి జిల్లా వాసులతోపాటు కర్ణాటక ప్రాంతవాసులు పాల్గొని మొక్కులు తీర్చుకొంటారన్నారు.

పార్లమెంట్‌లో సమస్యలు ప్రస్తావించండి



ఎంపీ తలారిరంగయ్యకు వినతిపత్రం అందిస్తున్న జీడీఎస్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

అనంతపురం సిటీ: దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న మా సమస్యలపై పార్లమెంట్‌లో ప్రస్తావించాలని ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ ఉద్యోగులు ఎంపీ తలారి రంగయ్యను కోరారు. మంగళవారం అనంతపురం జేఎన్‌టీయూ రోడ్డులోని ఎంపీ నివాసానికి యూనియన్ డివిజన్ కార్యదర్శి కృష్ణయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఉద్యోగులందరూ వెళ్లి వినతి పత్రం అందించారు. ప్రధానంగా ఏడో వేతన కమిటీలో అమలు కాని అంశాలతో పాటు డివిజన్ పరిధిలోని సమస్యలను అందులో పేర్కొన్నారు. ఎంపీ రంగయ్య స్పందిస్తూ కచ్చితంగా పార్లమెంట్ సమావేశాల్లో చర్చను లేవనెత్తి, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతానని హామీ ఇచ్చారు. ఎంపీని కలసిన వారిలో యూనియన్ ప్రతినిధులు షబ్బీర్, సూర్యనారాయణ రెడ్డి, రామ్మూర్తి, ఆనంద్‌బాబు, హనుమంతు, నాగభూషణ, లింగమయ్య, రమణారెడ్డి పాల్గొన్నారు.

ఎస్ఎల్ఎం కమిటీ సభ్యుడిని కలిసిన ఎంపీ రంగయ్య

అనంతపురం టవర్‌క్లాక్: కేంద్ర గ్రామీణాభివృద్ధి పథకాల శాఖ నేషనల్ లెవల్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ప్రదీప్ కుమార్, సంతోష్ కుమార్‌ను ఎంపీ తలారి రంగయ్య కలిశారు. మంగళవారం స్థానిక రోడ్లు భవనాలశాఖ అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామీణ స్థితిగతులపై చర్చించారు.

నిబంధనలను పాటించాలి

అనంతపురం అర్బన్: ఉద్యోగులకు సంబంధించి టాక్స్ డిడెక్షన్ స్కీమ్ (టీడీఎస్) విషయంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టరేట్ పరిపాలనాధికారి (ఏఓ) విజయలక్ష్మి డీడీఓలకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఏఓ వాణిజ్య పనుల శాఖ అధికారులతో కలిసి రెవెన్యూ భవన్‌లో డీడీఓలు (డిస్బర్సింగ్ డ్రాయింగ్ ఆఫీసర్స్) ఆదాయ పన్ను అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇన్‌కం ట్యాక్స్ అధికారి రాజశేఖర్ టీడీఎస్ ఏ నెలలో ఏ విధంగా ఎప్పుడు చేయాలి అనేదానిపై వివరించారు. డీడీలోలు నిబంధనలు పాటించకపోతే జరిమానా, ప్రాసిక్యూషన్ ఏ విధంగా ఉంటుదనేది వివరించారు.

శివబాలయోగి జయంతి

అనంతపురం కల్చరల్: ఆధ్యాత్మిక గురువు శివబాలయోగి జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. నగర శివారులోని శివబాలయోగి ఆశ్రమంలో ఉదయం నుంచి రాత్రి వరకు సాగిన ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు వెంకటేష్‌గుప్తా, రత్నగిరి దేవరాజు నేతృత్వంలో ఉదయం సహస్రలింగాలకు ,శివబాలయోగి మహరాజ్ విగ్రహానికి అభిషేకం చేయించారు. అనంతరం ఆశ్రమంలో వస్త్రదానం, అన్నదానం జరిగింది. ఆశ్రమ ప్రాంగణంలో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు విశ్వనాథశెట్టి, లక్ష్మీనారాయణ, చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.

నియమాలను కొనసాగిద్దాం

అనంతపురం కల్చరల్: మాలధారణ ఎంతో పవిత్రమైనదని, తద్వారా నేర్చుకున్న నియమాలను ఎప్పటికీ కొనసాగించాలని చిన్మయా మిషన్ జిల్లా ఇన్‌చార్జ్ స్వామి ఆత్మవిదానంద సరస్వతీ అన్నారు. మంగళవారం స్థానిక హరిహరదేవాలయంలో సాయిట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత భిక్షను ప్రారంభించారు. కార్యక్రమంలో గోవింద కల్యాణోత్సవాల నిర్వాహకులు మణూరు నాగరాజు, ఉమాదేవి ఆలయ కమిటీ ప్రతినిధులు రవి, రామ్మూర్తి పాల్గొన్నారు.

ప్రణాళికతో చదవాలి



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

అనంతపురం: ప్రణాళికాబద్ధంగా చదివితే పోటీ పరీక్షల్లో సులువుగా విజయం సాధించొచ్చని ఇంటర్మీడియట్ బోర్డు మాజీ కమిషనర్ డాక్టర్ డి.చక్రపాణి అన్నారు. మంగళవారం అనంతపురం నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హైకోర్టులో వాటర్‌మేనేజ్‌మెంట్ , వాటర్ డిస్ట్రిబ్యూషన్ జడ్జి జస్టిస్ పి. శంకర నారాయణ, ప్రజా సైన్స్ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం. సురేష్ బాబు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. మైండ్ మ్యాపింగ్, ఈ-నోట్ టేకింగ్ టెక్నిక్ గురించి వివరించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏసీఆర్ దివాకర్ రెడ్డి, కామర్స్ విభాగాధిపతి డాక్టర్ రంగనాథ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశాంక మౌళి తదితరులు పాల్గొన్నారు.